



కూలిన బతుకులు

ఓటర్ల తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తం



- కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రం
- రిటర్నింగ్ అధికారుల సమక్షంలో రూములకు సీలు: దగ్గరుండి పర్యవేక్షించిన కలెక్టర్ శుక్లా
- మూడంచెల పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాం: ఎస్పీ శ్రీధర్



అమలాపురం టౌన్, మే 13: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటర్ల తీర్పు ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. వాటిని కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. కోనసీమ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సెక్టార్ల వారీగా స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెల్లారేవరకు అక్కడే ఉండి ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత నిర్దేశించిన వాహనాల్లో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని సురక్షితంగా ఇంజనీరింగ్ కళాశాలకు చేర్చినట్టు కలెక్టర్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారుల పరిశీలన అనంతరం ఈవీఎంలను నిర్దేశించిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఆర్వోల సమక్షంలోనే స్ట్రాంగ్ రూములకు సీలు వేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్, ఆర్వో ఎస్.నుపూర్‌అజయ్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జి.కేశవర్ధనరెడ్డి, జీవీవీ సత్యనారాయణ, ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీవీఎస్ ఎల్లారావు, వి.మదన్‌మోహనరావు, ఎస్.సుధాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల వద్ద మూడు అంచెల పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన స్ట్రాంగ్ రూములను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎవరైనా సోషల్ మీడియా ఆధారంగా గానీ, ప్రత్యక్షంగా గానీ కవ్వింపు చర్యలకు పాల్పడినా, అలజడులు సృష్టించినా, ప్రోత్సహించినా... శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియలో భాగంగా ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్లో టీడీపీ, వైసీపీ నాయకులు ఒకరిపై ఒకరు ఘర్షణలకు దిగారు. పోలీసులు వారిని చెదరగొట్టగా ఎస్ఐకు కూడా గాయాలయ్యాయి. ఎస్ఐపై దాడి చేసిన వ్యక్తులతో పాటు అల్లర్లకు పాల్పడిన ఇరువర్గాలపై ఆత్రేయపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆత్రేయపురంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు. కపిలేశ్వరపురం మండలం అంగర పోలీసు స్టేషన్ పరిధిలోని వల్లూరులో జరిగిన గొడవను పురస్కరించుకుని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్పీ చెప్పారు.

కోనసీమ జిల్లా పోలింగ్ శాతం ఇలా..

అసెంబ్లీ	ఓటర్లు	పోలైనవి	శాతం
అమలాపురం	2,13,508	1,75,845	82.26
పి.గన్నవరం	1,98,602	1,65,749	81.81
కొత్తపేట	2,52,383	2,14,975	85.18
మండపేట	2,20,494	1,91,959	87.06
ముమ్మిడివరం	2,45,296	2,05,163	83.64
రామచంద్రపురం	2,03,207	1,73,917	85.59
రాజోలు	1,97,920	1,56,400	79.02
కోనసీమ జిల్లా	15,31,410	12,84,008	83.84





చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, భద్రత ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ శ్రీధర్

ప్రత్యర్థులపై కత్తితో దాడి

చిన్నారికి తీవ్ర, మరొకరికి స్వల్ప గాయాలు

కూటమి నేతలపై వైసీపీ శ్రేణుల దాడులు

కపిలేశ్వరపురం మండలం వల్లూరులో తీవ్ర ఉద్రిక్తత

జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ అరెస్టు

రామచంద్రపురం కోర్టులో హాజరు బెయిల్‌పై విడుదల

వివరాలు... 7లో

ఉడిమూడి రహదారిపై మృతుల బంధువుల ధర్నా



దూసుకొచ్చిన మృత్యువు

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- నలుగురు అక్కడికక్కడే మృతి
- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- ధాన్యం లోడ్ చేస్తుండగా ఘటన
- ఉడిమూడి వద్ద ప్రమాదం
- రెండు గ్రామాల్లో తీవ్ర విషాదం
- న్యాయం చేయాలని ధర్నా

పి.గన్నవరం/అంబాజీపేట/రావులపాలెం, మే 14: ఉదయం నుంచి ఆనందంగా పనిచేస్తున్నారు.. కాసేపట్లో పనిముగించుకుని ఇళ్లకు వెళ్లిపోదామని చీకట్లోనే పని చేస్తుండగా ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది.. నలుగురు కూలి బతుకులను కూల్చివేసింది.. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేట వద్ద 10 మంది కూలీలు ట్రాక్టర్‌పై ధాన్యం లోడు చేస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. జట్టు కూలీలతో పాటు బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. పి.గన్నవరం మండలం ఆదిమూలవారిపాలెంలో ఒకే కుటుంబానికి చెందిన చిలకలపూడి మణిబాబు (31), చిలకలపూడి సురేష్, గంటి పెదపూడి గ్రామానికి చెందిన నూకపెయ్యి శివ (32), వాసంశెట్టి సూర్యప్రకాష్ (48), ఈరి కట్టయ్య (46)లతో పాటు మరో ఆరుగురు కలిసి మంగళవారం తెల్లవారుజామున ధాన్యం లోడు చేసేందుకు చింతావారిపేట వచ్చారు.ఉదయం నుంచీ ధాన్యం పట్టుబడులు పట్టి రాత్రి 7 గంటల సమయంలో ప్రధాన రహదారి చెంతనే ట్రాక్టర్ ధాన్యం బస్తాలను లోడ్ చేసి పగ్గం బిగిస్తున్నారు.ఈ సమయంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వైపు వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టరును బలంగా ఢీకొని జట్టు కూలీలపై నుంచి దూసుకుపోయింది.నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా బస్సు సుమారు 10 మీటర్ల మేర ఈడ్చుకుపోవడంతో మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో రహదారిపై చిందవందరగా పడ్డాయి. దీంతో భయానక వాతావరణం ఏర్పడింది. మృతదేహాల వద్ద కుటుంబీకులు రోధిస్తున్న తీరు ప్రయాణికులను సైతం కలిచివేసింది. ఒక మృతదేహం నుజ్జునుజ్జుకావడంతో మూటకట్టారు. ఇద్దరికి తీవ్ర గాయాలు నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. జట్టు కూలీలు చిలకలపూడి సురేష్, బొరుసు నానిలకు తీవ్ర గాయాలయ్యాయి. సురేష్‌ను తొలుత పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. నానితో పాటు గాయాలపాలైన ప్రయాణికులను కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పి.గన్నవరం నుంచి ఈతకోట వెళ్లే రహదారిలో ప్రయాణం ప్రమాదభరితమే. ప్రధాన పంట కాలువకు రక్షణగోడ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు చెప్పారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కనీసం వీధిలైట్లు కూడా లేవు. సెల్ ఫోన్ల లైట్ల వెలుగులో పోలీసులు మృతదేహాలను గుర్తించి వివరాలు నమోదు చేయాల్సి వచ్చింది. అందరితో కలుపుగోలుగా ఉండే వారు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలచివేసింది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్,ఈరి కట్టయ్య ఆదిమూలవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులు రోధిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. తమకు న్యాయం చేయాలంటూ మృతదేహాలతో మృతుల కుటుంబీకులు, స్థానికులు ధర్నాకు దిగారు.ఒక్కొక్కరికీ రూ.10లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో రావాలని నినాదాలు చేశారు.న్యాయం చేసే వరకు మృతదేహాలను తరలించ మంటూ భీష్మించారు.ఆర్డీవో వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద స్థలికి కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ,సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బి.శివకృష్ణ చేరు కుని మృతుల వివరాలు సేకరించారు.ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవరు సంఘటనాస్థలానికి రావాలంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగారు.మృతదేహాలను జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కూటమి శ్రేణులు పరిశీలించారు.రోడ్డు ప్రమాద మృతుల కుటుం బీకులు ఒక్కొక్కరికీ రూ.లక్ష వంతున సాయం అందిస్తానని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ప్రకటించారు. కూటమి శ్రేణులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు, రుద్రరాజు వీరభద్రరాజు, అరిగెల సూరిబాబుతో పాటు పలువురు ప్రమాద స్థలికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మృతుల కుటుంబీకుల రోదన



మణిబాబు కట్టయ్య సూర్యప్రకాష్

ఆలమూరు మండలం జొన్నాడ వద్ద పిల్లర్లకే పరిమితమైన ఫ్లైఓవర్ పనులు (పైన) రాజమహేంద్రవరంలోని మోరంపూడి వద్ద ఫ్లై ఓవర్ పనులు (ఇన్‌సెట్‌లో)





- జొన్నాడ వద్ద ముందుకు సాగని ఫ్లైఓవర్ పనులు
- ప్రమాదాలకు నిలయంగా జొన్నాడ సెంటరు
- బస్సు ప్రయాణికులకు నరకయాతన
- పట్టించుకోని హైవే అధికారులు

అక్కడ అలా... ఇక్కడ ఇలా...

ఆలమూరు, మే 14:

జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారానికి హైవే అధికారులు జాతీయ రహదారి 216(ఎ)పై రాజమహేంద్రవరంలోని మోరంపూడి, ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణాణానికి శ్రీకారం చుట్టారు. రెండుచోట్లా పనులకు గతేడాది జనవరిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది జనవరికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. మోరంపూడి వద్ద పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం దాదాపు పూర్తి కాగా అప్రోచ్ పనులు జరుగుతున్నాయి. రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి రానుంది. జొన్నాడ వద్ద గతేడాది మార్చిలో పనులు ప్రారంభించగా నత్తనడకన కొనసాగుతున్నాయి. మోరంపూడి వద్ద పనులు పూర్తి కావస్తున్నా జొన్నాడ వద్ద పిల్లర్లకే పరిమితమైంది. ఎందుకంత వివక్ష చూపుతున్నారో అంతుపట్టడం లేదు.

కాగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో గత ఏడాదిన్నరగా జొన్నాడ సెంటరు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫ్లైఓవర్ పనుల పేరుతో ఎటువంటి నియమ, నిబంధనలు పాటించకుండా వదిలేయడంతో తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు మృత్యువాతపడగా అనేక మంది గాయలపాలవుతున్నారు. హైవే అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవట్లేదు. రోడ్డు ఒకపక్క నుంచి మరో పక్కకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. పిల్లర్ల నిర్మాణానికే ఏడాది పట్టిందంటే పనులు ఎంత నత్తనడకన సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఆలమూరు మండలంలోని అనేక గ్రామాల వారికి జొన్నాడ ముఖ్య కూడలి. నిత్యం వందలాది మంది ఇక్కడకు చేరుకుని రాజమహేంద్రవరం వెళ్తుంటారు. బస్సు షెల్టర్లు పూర్తిగా తొలగించి సర్వీసు రోడ్డు వేశారు. దీంతో సుమారు 15 నెలలుగా ప్రయాణికులు ఎండైనా, వానైనా బస్సుల కోసం రోడ్డుమీదే నిరీక్షించాల్సి వస్తోంది. సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులతో బస్సులను ఎక్కడ ఆపుతారో తెలియక వృద్ధులు, వికలాంగులు, మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ హైవే అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదు. అధికారులు స్పందించి ఫ్లైఓవర్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నీ కూడికలే... తీసివేతల్లేవ్!

ఉప్పలగుప్తం, మే 14: పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ప్రస్తుతం అన్ని పార్టీల నాయకులు లెక్కలతో కుస్తీ పడుతున్నారు. ఏ ప్రాంతంలో చూసినా పోలైన ఓట్ల లెక్కలపై ఊహాగానాలే. బూత్‌ల వారీగా ఓటింగ్ శాతం ఆధారంగా తమకు లాభమా? ప్రత్యర్థికి ప్రయోజనమా అని లెక్కలు వేస్తున్నారు. అయితే పోటీలో ఉన్న అన్ని పార్టీల నాయకులు తీసివేతలను వదిలేసి కూడికలనే నమ్ముకోవడం వింతగా ఉంది. జిల్లాలో పోలింగ్ శాతం 80 దాటిన కారణంగా ఎవరికి ప్రయోజనం అనే అంశంపై విశ్లేషకులు గత రెండు దఫాల ఎన్నికల పోలింగ్ చిట్టాలను బయటకు తీసి లెక్కలు వేస్తున్నారు. అయితే రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు గ్రామాల వారీగా పెరిగిన పోలింగ్ శాతం తమ విజయానికి సహకరిస్తుందని ఎవరికి వారు అన్వయించుకుంటున్నారు.గత ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు, అంతకు ముందు కూటమిగా పోటీచేసి, అనంతరం విడిగా పోటీకి దిగడం వంటి అంశాలు తమకు తీసివేతగా పరిణమించి అప్పట్లో ఓటమి పాలయ్యామని ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న పార్టీ వ్యాఖ్యానిస్తోంది. ఇప్పుడు కూటమిగా పోటీలో ఉండటం, ప్రభుత్వ వ్యతిరేకత, తమకు కూడికగా ప్రతిపక్ష పార్టీ చెప్పుకుంటోంది. ఈ కారణంగా ఎంత ఎక్కువ మంది పోలింగ్ కేంద్రాలకు వస్తే అంతగా తమకు ప్లస్ కాగలదని అంచనా వేస్తున్నారు. ఇది నూరుశాతం సరైన లెక్కేనని విశ్లేషకులు అంటున్నారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ మాత్రం పెరిగిన పోలింగ్ శాతం తమకు మాత్రమే ప్లస్‌గా చెప్పుకుంటోంది. దీనితో పాటు ఎన్నడూ లేని విధంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు సైతం తమ ఓటు బ్యాంకుగానే ఆ పార్టీ నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. మరి పెరిగిన పోలింగ్ శాతం తమకు ప్లస్‌గా రెండు పార్టీలు లెక్కగట్టడం విచిత్రంగా అన్పించినా జరుగుతున్న తంతు మాత్రం అదే. అసలు లెక్క తేలాలంటే మరికొద్ది రోజులు వేచిచూడాల్సిందే.

కాయ్ రాజా కాయ్!

గెలుపుపై కాదు.. అభ్యర్థుల మెజార్టీపైనే పందేలు

అమలాపురం రూరల్, మే 14: పోలింగ్ ప్రక్రియ ముగిసింది. బెట్టింగుల పర్వానికి తెర లేచింది. పోలింగ్ సరళిని అంచనా వేసుకుని ఈసారి అభ్యర్థుల గెలుపు, ఓటములపైకాకుండా ప్రధాన పార్టీ అభ్యర్థులకు వచ్చే మెజార్టీపైనే పందేలు జోరుగా జరుగుతున్నాయి. అమలాపురం లోక్‌సభ స్థానం నుంచి పోటీకి నిలిచిన ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి ప్రారంభం నుంచి నైరాశ్యంలో ఉండడంతో ప్రత్యర్థి ఘన విజయం ఖాయమని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చెబుతున్నారు. దాంతో అమలాపురం లోక్‌సభ అభ్యర్థి మెజార్టీ 2లక్షలు దాటుతుందని కొందరు, 2లక్షలలోపేనని మరికొందరు పందేలకు ఎగబడుతున్నారు. ఇక విజయానందంలో ఉన్న అమలాపురం అసెంబ్లీ అభ్యర్థికి వచ్చే మెజార్టీపై మూడు స్థాయిల్లో బెట్టింగులు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఆ అభ్యర్థికి 5వేలు, 10వేలు, 20వేలు మెజార్టీ వస్తుందని లెక్కలు వేసుకుని మరీ బెట్టింగులకు తెర లేపినట్టు సమాచారం. బెట్టింగు రాయుళ్లు ఇప్పటికే పెద్ద మొత్తాల్లో పందేలకు దిగినట్టు తెలిసింది. ఏది ఏమైనా ఆ పార్టీ అభ్యర్థుల మెజార్టీపై నిర్వహిస్తున్న పందేలపై ప్రత్యర్థి పార్టీ ఓటమి పాలైనట్టేనా అని చర్చించుకోవడం విశేషం

ఆత్రేయపురం: కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు గెలుపుపై జోరుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. పలుచోట్ల రెట్టింపు పందేలు వేస్తున్నారు. అంతేగాక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందంటూ పందాలకు దిగుతున్నారు. అధికార పార్టీ వెనుకడుగు వేస్తుండగా కూటమి నాయకులు సై అంటున్నారు. కూటమి అభ్యర్థుల తరఫున లక్షకు లక్షన్నర ఇస్తామంటూ కాలు దువ్వుతున్నారు.

రావులపాలెం: మండలంలో పందేలు జోరందుకున్నాయి. కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి గెలుపు ఖాయమంటూ కొందరు ఒకటికి మూడు రెట్లు, మరికొందరు 20వేలకు పైగా మెజారిటీ వస్తుందని పందేలు కాస్తున్నారు. వైసీపీ అభ్యర్థి గెలుపుపై ఇంకొందరు పందేలు వేస్తున్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం. 5

పాఠకుని పూర్తి పేరు : ....

దోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

తూర్పుగోదావరి ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తుని				
2. జగ్గంపేట				
3. ప్రత్తిపాడు				
4. పెద్దాపురం				
5. పిఠాపురం				
6. కాకినాడ సిటీ				
7. కాకినాడ రూరల్				
8. అనపర్తి				
9. రాజానగరం				
10. రాజమండ్రి రూరల్				
11. రాజమండ్రి సిటీ				
12. రంపచోడవరం				
13. రామచంద్రపురం				
14. మండపేట				
15. కొత్తపేట				
16. పి. గన్నవరం				
17. రాజోలు				
18. అమలాపురం				
19. ముమ్మిడివరం				
మొత్తం :				


కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : డోరు నెం. 114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్, పాలచర్ల గ్రామ పంచాయితీ, రాజానగరం మండలం, రాజమండ్రి - 533102.

పిఠాపురం ఎటు వైపో?



86.63%



ఓట్ల శాతం

తీరం దాటింది



యువ ఓటర్ల ఉత్సాహం

పిఠాపురం నియోజకవర్గంలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన కొత్త ఓటర్లు



పిఠాపురం, మే 14: పిఠాపురంలో రికార్డుస్థాయి పోలింగ్ నమోదయింది. అసెంబ్లీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 86.63 శాతం నమోదైన ఈ ఓటింగ్ ఎవరికి వరంగా మారుతుందో అన్న చర్చ జోరుగా సాగుతోంది. వార్ వన్‌సైడ్ అవ్వడం వలనే ఇంత ఓటింగ్ జరిగిందని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఓటింగ్‌లో యువ, మహిళా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో భారీ పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి రాత్రి 11గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవడం ఇందుకు అద్దం పట్టింది. ఎండ తీవ్రతను లెక్కచేయకుండా యువతీ యువకులు, మహిళలు, వృద్ధులు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంపై ఓటింగ్‌పై ప్రభావం చూపించింది.

పిఠాపురం నియోజకవర్గంలో ఓట్ల ప్రవాహం

నియోజకవర్గం చరిత్రలోనే తొలిసారి అత్యధిక శాతం నమోదు

నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,18,183 ఉండగా మహిళలు 1,18,223 మంది, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారు. ఇందులో 2,04,811 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా, ఇందులో 1,03,370 మంది పురుషులు, 1,01,438 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 86.63గా నమోదయింది. 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే ఇది 5.62 శాతం అధికం. ఆ ఎన్నికల్లో 81.01 శాతం మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,71,234 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోగా పురుషులు 83,441 మంది ఉండగా, మహిళలు 87,791 మంది ఉన్నారు. 2014లో 79.44 శాతం మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పెరిగిన ఓటు దేనికి సంకేతం?

అసెంబ్లీ ఏర్పడిన తర్వాత ఇదే అత్యధిక ఓటింగ్ శాతం. రికార్డుస్థాయి పోలింగ్ నమోదు కావడంతో పెరిగిన ఓటింగ్ దేనికి సంకేతమనే చర్చ జోరుగా సాగుతోంది. యువ ఓటర్లు అత్యధికంగా ఓటింగ్‌కు తరలిరావడం ఇందుకు కారణంగా చెబుతున్నారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పోటీ చేయడం, ప్రభుత్వంపై వ్యతిరేకత తదితర కారణాలతో యువత ఓటింగ్‌కు వచ్చేందుకు ఉత్సాహం చూపించారు. అదే విధంగా ఇతర ప్రాంతాల్లో వృత్తి, వ్యాపార, ఉద్యోగాల రీత్యా ఉంటున్న వారు ఓటింగ్‌కు తరలివచ్చారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే స్థానికంగా ఉంటున్నవారు కాకుండా హైదరాబాదు, బెంగళూరు, చెన్నై నగరాలతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాలు, కర్నాటక, ఒడిసా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలు నుంచి సుమారు 16-17వేల మంది వచ్చారు. వీరితో పాటు విదేశాల్లో ఉంటున్న మరో 500-600 మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చారు. స్థానికంగా ఉండే ఓటర్లతో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న నియోజకవర్గ ఓటర్లు తరలిరావడమే కారణంగా భావిస్తున్నారు.

రాత్రి 11 గంటల వరకు..

గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా ఓటర్లు బారులు తీరి ఉండటంతో ఓటింగ్ ఆలస్యమైంది. నియోజకవర్గంలోని పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు విరవ, విరవాడ, చిత్రాడ, దుర్గాడ, చేబ్రోలు, తాటిపర్తి తదితర గ్రామాల్లో సాయంత్రం 6 గంటల సమయానికి ఈ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతి చోటా 100 నుంచి 200 మంది వరకూ ఓటర్లు క్యూలో ఉన్నారు. కత్తులగూడెం పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ పూర్తయ్యేసరికి రాత్రి 11 గంటలు దాటింది. ఇక్కడ క్యూలో దాదాపు 300 మంది ఓటర్లు ఉండిపోయారు.

పవన్‌పై ప్రేమ అంటున్న జనసేన శ్రేణులు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై పిఠాపురం నియోజకవర్గ ప్రజలు చూపించి ప్రేమ, ఆదరాభిమానాలకు ఈ ఓటింగ్ నిదర్శనమని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అందుకే రికార్డుస్థాయి ఓటింగ్ నమోదైందని, ఇది వార్ వన్‌సైడ్ అయిందనేందుకు నిదర్శనమని వారు పేర్కొంటున్నారు. పవన్‌కు ఓటు వేసేందుకు నియోజకవర్గంలో ఓటర్లు ఉండి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నవారంతా ఇక్కడకు తరలివచ్చారని వారు తెలిపారు. ఓటింగ్ మాదిరిగానే మెజార్టీ కూడా ఉంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు. పెరిగిన ఓటింగ్ వైసీపీలో కలవరాన్ని సృష్టిస్తున్నది. నేతలు ఎవ్వరు నోరు మెదిపేందుకు ఆసక్తి చూపడం లేదు.



పిఠాపురం కత్తుల గూడెంలో రాత్రి 10గంటలకు కూడా క్యూలోనే ఓటర్లు

పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం

పవన్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు

కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ కుట్రలు

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, మే 14: 'పిఠాపురం నుంచి పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు ఎంత మెజార్టీ ఇస్తారనేది ప్రజల నిర్ణయం. మాకు మాత్రం ప్రజలకు ఏమి చేస్తాం. ఎంత అభివృద్ధి చేస్తామనేదే ముఖ్యం' అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కెనాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ బాధ్యతాయుతమైన వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. శ్రామికులు స్వేదం తుడుచుకోవడానికి వాడే కాశీ తువ్వాలుపై కూడా వైసీపీ చేసిన కుట్రలు విఫలమయ్యాయని చెప్పారు. పవన్ జనసేన అధ్యక్షుడి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా జనసేనతో పాటు కూటమి తరపున ప్రచారం నిర్వహించారని తెలిపారు. పిఠాపురానికి పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేని పరిస్థితుల్లో కమిటీలను ఏర్పాటు చేశారని, కమిటీ సభ్యులందరూ బాధ్యతతో ప్రచారం నిర్వహించి అన్ని విధాల సహకరించారని చెప్పారు. జనసైనికులు, వీరమహిళలు అహర్నిశలు శ్రమించారని తెలిపారు. పవన్ కోసం రాష్ట్రం నుంచే గాక తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, ఒడిసా తదితర రాష్ట్రాలు నుంచి ఎంతో మంది స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం నిర్వహించారన్నారు. పవన్‌ను నిలబెట్టుకోవడానికి, గెలిపించుకునేందుకు పిఠాపురం ప్రజలు పరితపించిన తీరు తమకు సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. వైసీపీ దుర్మార్గ పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా రాష్ట్ర వ్యాప్తంగా బయటకు వచ్చి ఓటు వేశారని తెలిపారు. పవన్ గెలుపు కోసం నిరంతరం శ్రమించిన నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు, స్నేహితులు, మిత్రులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు నాగబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, మహేంద్రరెడ్డి, శంకరగౌడ్, గంటా స్వరూప, కడలి ఈశ్వరి, కదారి తమ్మయ్యనాయుడు, పిల్లా శివశంకర్, పిల్లా రమ్యజ్యోతి, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, బీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నంది వాహనంపై వీరేశ్వరస్వామి



ఐ.పోలవరం, మే 14: మురమళ్ల శ్రీభద్రకాళీవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. నాలుగో రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం విశేష అభిషేకం, చండీ హోమం, కళా హోమాలు, సాయంత్రం నంది వాహనంపై ఊరేగింపు, సదస్యం, సభాపూజ, పండిత సత్కారం తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల వేద పండితులు పాల్గొన్నారు. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆత్రేయపురంలో ఉద్రిక్తత

ఇరు రాజకీయ పార్టీల మధ్య ఘర్షణ

మోహరించిన పోలీసులు

వైసీపీ నేత సోషల్ మీడియాలో సవాల్ పోస్టు

వైసీపీ ఘర్షణలో గాయపడిన టీడీపీ కార్యకర్త

ఎస్ఐ చెవికి గాయం

ఆత్రేయపురం, మే 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో మంగళవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరిగిన ఘర్షణ చిలికిచిలికి గాలివానై ఉద్రిక్తతకు దారితీసింది. సోమవారం ఆత్రేయపురంలోని నెం.27 పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ నేతలు వెళ్లడంతో అక్కడే ఉన్న టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు (గబ్బర్‌సింగ్) అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న వైసీపీ శ్రేణులు వెంకట్రాజుపై దాడికి పాల్పడ్డారు. ఆయన చొక్కా చిరిగి భుజానికి గాయమైంది. గొడవ సద్దుమణిగిందన్న తరుణంలో ఆత్రేయపురానికి చెందిన వైసీపీ నేత వేగేశ్న గోపిరాజు టీడీపీ నేతలకు సవాల్ విసురుతూ సోమవారం రాత్రి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్ కలకలం సృష్టించింది. వైసీపీ నేతల అరాచకాలతో విసిగి వేసారిన టీడీపీ శ్రేణులు మంగళవారం ఉదయం రావిచెట్టు సెంటరు వద్దకు వెళ్లారు. అదే సమయంలో వైసీపీ శ్రేణులు కూడా వచ్చాయి. అక్కడ ఇరు వర్గాల వారు కలబడగా కొందరు స్వల్పంగా గాయపడ్డారు. టీడీపీ కార్యకర్త ముదునూరి రామభద్రరాజును గాయపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తున్న తరుణంలో ఎస్ఐ చెవికి గాయమైంది. పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్టేషన్ వద్దకు చేరుకుని పరిస్థితికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోపక్క టీడీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సలాది రామకృష్ణ, కప్పల సునీల్, చిలువూరి సతీష్‌రాజు, కరుటూరి నరసింహారావు జరిగిన అన్యాయంపై పోలీసులను నిలదీశారు. సీఐ, ఎస్ఐలు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని డీఎస్పీ కేవీ రమణపై మండిపడ్డారు. అనంతరం డీఎస్పీ టీడీపీ నాయకులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు హుటాహుటిన ముదునూరి వెంకట్రాజు స్వగృహానికి చేరుకున్నారు. నాయకులతో సమావేశమై అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలపై చర్చించారు. రాష్ట్రంలోను, కొత్తపేట నియోజకవర్గంలోను ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని, అది ఓర్వలేకే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు ఉసిగొల్పడం సిగ్గుచేటన్నారు. అనంతరం టీడీపీ శ్రేణుల తరఫున లీగల్ సెల్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఆత్రేయపురంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రిజర్వ్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మోహరించిన పోలీసులు



గాయపడ్డ టీడీపీ కార్యకర్త

అమెరికా నుంచి ఓటేయడానికి వచ్చా..



అమలాపురం టౌన్, మే 14: రాకూర్తి వెంకటేష్ అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలోని జార్జ్ ఎంసన్ యూనివర్సిటీలో మాస్టర్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదువుతున్నాడు. ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించేవని ప్రగాఢంగా నమ్మిన అతను అమెరికా నుంచి ఓటేయడానికి వచ్చాడు. అమలాపురంలో ఓటే వేశాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ అప్పులపాలైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు రాష్ట్రానికి రాజధాని నిర్మించి, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న భావనతోనే సెలవు పెట్టి మరీ అమెరికా నుంచి వచ్చి ఓటేశానని చెప్పారు.

సత్యదేవుడి సేవకు ఛత్రముల బహూకరణ



ఛత్రములు బహూకరిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 14: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సేవకు ఉపయోగించే ఛత్రములను మంగళవారం ఒకదాత విరాళంగా సమర్పించారు. గుడివాడకు చెందిన అమ్మా కన్‌స్ట్రక్షన్ అధినేత మాటూరి రంగనాథ్ వీటిని దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతను పీఆర్వో అభినందించి వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు. ఈనెల 18 నుంచి ప్రారంభంకానున్న స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలలో వినియోగించి నిరంతరం స్వామివారి సేవలకు ఉపయోగిస్తామని పీఆర్వో తెలిపారు.

కూటమి నేతలపై వైసీపీ శ్రేణుల దాడులు

వల్లూరులో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లీలాకృష్ణ అరెస్ట్

రామచంద్రపురం కోర్టుకు హాజరు..విడుదల

కపిలేశ్వరపురం, మే 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరులో పోలింగ్ నేపథ్యంలో స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన వైసీపీ, కూటమి నేతల మధ్య పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణపై వైసీపీ వర్గీయులు తప్పుడు హత్యాయత్నం కేసు బనాయించారనే ఆరోపణలు పరిస్థితిని మరింత వేడెక్కించాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వల్లూరులో సోమవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్, అంగర ఎస్ఐ ఎ.పరదేశి అక్కడకు చేరుకుని నాయకులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఆయన తనయుడు పృథ్వీరాజ్ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో దెబ్బతింది. దీంతో అదే గ్రామానికి చెందిన ఒకరిపై మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు వైసీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి నేతలపై వైసీపీ నేతలు దాడి చేసి అక్రమ కేసులు బనాయించడంతో లీలాకృష్ణను వల్లూరులో ఆయన స్వగృహంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు అక్రమ అరెస్ట్ చేసి భారీ బందోబస్తు నడుమ ఆయనను కె. గంగవరం మండలం పామర్రు పోలీస్ స్టేషన్‌కు అక్కడ నుంచి మండపేట సీఐ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకున్నాయి. అక్కడ నుంచి ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చి వైద్య పరీక్షల అనంతరం ఆయనను మండపేట సీఐ కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి ఆయనను రామచంద్రపురం కోర్టులో జడ్జి ముందు హాజరుపర్చగా వాదనలు విన్న అనంతరం జడ్జి లీలాకృష్ణకు బెయిల్ మంజూరు చేయగా ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతరం లీలాకృష్ణ మాట్లాడుతూ తనను అన్యాయంగా కేసులో ఇరికించి కుట్ర రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆయన వెంట రామచంద్రపురం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్, మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు వరప్రకాష్ ఉన్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.



రామచంద్రపురం కోర్టు నుంచి విడుదలైన లీలాకృష్ణ

తప్పుడు కేసులు బనాయించారు

రామచంద్రపురం, మే 14: తనపై పోలీసు అధికారుల సహకారంతో హత్యాయత్నం కేసులు బనాయించారని మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆరోపించారు. మంగళవారం రామచంద్రపురం కోర్టు నుంచి బెయిల్‌పై విడుదల అయిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వల్లూరులో ఉద్దేశపూర్వకంగానే గొడవ పెట్టుకున్నారని ఆరోపించారు. పోలీసు అధికారుల సహకారంతో తమపై కేసు పెట్టారన్నారు. కోర్టులో వాస్తవాలు వివరించడంతో బెయిల్ మంజూరయ్యిందన్నారు. డీఎస్పీ, సీఐల సహకారంతోనే తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

లీలాకృష్ణ అరెస్టు అమానుషం

జనసేనాని పవన్‌కల్యాణ్ ఖండన

మండపేట, మే 14: జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణను పోలీసులు అరెస్టు చేయడాన్ని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఖండించారు. ఈమేరకు జనసేన కేంద్ర కార్యాలయం నుంచి పవన్‌కల్యాణ్ పేరిట లేఖను విడుదల చేశారు. వైసీపీకి చెందిన వారు జనసేన వారిపై కవ్వింపు చర్యలకు పాల్పడిన నేపథ్యంలో లీలాకృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేయడంలో రాజకీయ కుట్ర దాగి ఉందని పవన్ పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై, అతడి అనుచరులపై కేసు నమోదు చేయకపోవటాన్ని పవన్ తప్పు పట్టారు. లీలాకృష్ణ అరెస్టు అన్యాయమని పవన్ అన్నారు. లీలాకృష్ణకు జనసైనికులు, పార్టీ అండగా ఉంటుందన్నారు.

ప్రత్యర్థులపై కత్తితో దాడి

చిన్నారికి తీవ్రగాయాలు, మరొకరికి స్వల్ప గాయాలు

అమలాపురం టౌన్, మే 14: సరిహద్దు తగాదాల నేపథ్యంలో గతంలో తన భార్యను హత్య చేసిన కేసులో ప్రతికారం తీర్చుకునేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ప్రత్యర్థి వర్గంపై మంగళవారం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కత్తితో చేసిన ఈ దాడిలో ఓ చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. 2021 మే 14న అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో డీఎస్పీ కార్యాలయానికి సమీపంలో తల్లీకొడుకులపై జరిగిన దాడిలో తల్లి కోండ్రు దుర్గ(45) అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు రమేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. మినీ వ్యాన్‌లో మారణాయుధాలతో వచ్చిన మంగం బాలయోగి కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా ఈ హత్యకు పాల్పడినట్టు అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదు చేశారు.

సరిగ్గా నేడు అదే రోజున..

ప్రత్యర్థి వర్గంపై పగతో రగలిపోతున్న హత్యకు గురైన దుర్గ భర్త కోటేశ్వరరావు పక్కా ప్రణాళికలతో సిద్ధమయ్యి మంగళవారం దాడి చేశాడు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ అందించిన వివరాలు ప్రకారం... దుర్గ హత్య కేసులో వాయిదా నిమిత్తం మంగం బాలయోగి కుటుంబ సభ్యులు కోర్టుకు హాజరయ్యారు. వారు కోర్టుకు వస్తున్నారన్న సమాచారంతో ఆటో డ్రైవర్ అయిన కోటేశ్వరరావు పక్కా ప్రణాళికతో అమలాపురం వచ్చాడు. కోర్టు నుంచి తిరిగి వెళ్తుండగా బాలయోగి భార్య మంగ అనారోగ్యంతో బాధపడుతుండడంతో గనికమ్మ వీధిలో తాయత్తు తెచ్చుకునేందుకు వెళ్లాడు. ఈ లోపున బాలయోగి మనుమరాలైన గుణశ్రీని తీసుకుని బాలయోగి కుమారుడు విజయ్ మెయిన్‌రోడ్డులో నడిచి వెళ్తుండగా ఆటోలో వచ్చిన కోటేశ్వరరావు మాటువేసి ఒక్కసారిగా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కత్తితో చేసిన దాడిలో గుణశ్రీ తలకు తీవ్ర గాయమైంది. విజయ్‌కు స్వల్ప గాయమైంది. మెయిన్‌రోడ్డులో ఈ సంఘటన జరగడంతో స్థానికులు ఒక్కసారిగా కోటేశ్వరరావును చుట్టుముట్టి దేహశుద్ధి చేశారు. గాయపడ్డ గుణశ్రీని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కోటేశ్వరరావును ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ క్రిస్టఫర్ తెలిపారు. అదే విధంగా కోటేశ్వరరావుపై జరిగిన దాడి ఘటనపై వారి కుటుంబ సభ్యుడు బాలయోగి తదితరులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా మెయిన్‌రోడ్డులోని చైతన్య టెక్నో స్కూలు ఎదురుగా జరిగిన దాడి సమాచారం తెలుసుకున్న డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని పోలీసు వాహనంలోనే ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. మానవత్వం చాటుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎస్.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.



చికిత్స పొందుతున్న గుణశ్రీ

స్థానికుల దేహశుద్ధితో పడిఉన్న కోటేశ్వరరావు

చెట్టును ఢీకొన్న కారు

మహిళ మృతి..మరో ఇద్దరికి గాయాలు



చింతూరు, మే 14 : అదుపు తప్పిన కారు చెట్టుకు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందారు. కృష్ణా జిల్లా గంపలగూడెంకు చెందిన ఒక కుటుంబం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి వచ్చారు. అనంతరం మంగళవారం తిరిగి వారి ప్రాంతానికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో చింతూరు మండలం, కాటుకపల్లి సమీపంలో అదుపుతప్పిన కారు రహదారిని ఆనుకొని ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మి (46) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు మహిళలకు, కారు డ్రైవర్‌కు, ఒక బాలుడికి కూడా గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. చింతూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యానాం క్రీడాకారుల ప్రతిభ

యానాం, మే14: పుదుచ్చేరి రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో యానాం క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని యానాంస్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ తెలిపారు. పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8జోన్ల నుంచి 640మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-17 బాలికల 100మీటర్లలో ద్వితీయ, 400మీటర్లలో ప్రథమ, అండర్-19బాలుర లాంగ్‌జంప్‌లో బాబి ప్రసాద్ ప్రథమ, హైజంప్‌లో ప్రేమ్‌రక్షిత్ ద్వితీయస్థానం సాధించారు. పలు పోటీల్లో యానాం క్రీడాకారులు ఫైనల్స్‌కు చేరారు.

తెలుగుదేశం పార్టీ మెజార్టీపై అంచనాలు







అమలాపురం: పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన దాట్ల సుబ్బరాజు, అమలాపురం: చుట్టుముట్టిన అభిమానంతో ఆనందోత్సాహాలు, పి.గన్నవరం: పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

- కార్యకర్తలతో నాయకుల సమావేశం
- పోలింగ్ సరళి, మెజార్టీపై చర్చ

ముమ్మిడివరం, మే 14: ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిపి ఏయే గ్రామాల్లో ఏయే బూత్‌ల్లో ఎన్ని ఓట్లు వస్తాయో అనే దానిపై అంచనాలు ప్రారంభించారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం అర్ధరాత్రి వరకు సాగడంతో బిజీబిజీగా ఉన్నా మంగళవారం మురమళ్లలోని ఆయన నివాస గృహంలో కొంతసేపు కుటుంబ సభ్యులతో కలిపి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మమేకమయ్యారు. ఏగ్రామంలో తమకు అనుకూలంగా ఎన్ని ఓట్లు పడ్డాయి, ప్రతికూలంగా ఉన్న గ్రామాల్లో ఎన్ని ఓట్లు కోల్పోతాం అనే లెక్కలు కట్టుకుని మెజార్టీపై అంచనాల్లో నిమగ్నమయ్యారు. ఓట్ల సరళిపై చేసిన అంచనాల్లో మెజార్టీ ఎక్కువగా వచ్చే అవకాశాలు కనిపించడంతో వారిలో జోష్ కనిపిస్తోంది. జనసేన ఓట్లు ఎక్కువ మొత్తంలో కలిసి రావడం, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లు 8వేల మంది నియోజకవర్గానికి వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీటిలో మెజార్టీగా 90శాతం ఓట్లు టీడీపీకి పడినట్టు అంచనా. ముమ్మిడివరం మండలంలో 5వేల నుంచి 6వేలు మెజార్టీ, ఐ.పోలవరం మండలంలో 8వేల నుంచి 10వేల వరకు మెజార్టీ లభిస్తుందని అంచనా. ఈసారి తాళ్లరేవు మండలం నుంచి కూడా 4వేల నుంచి 5వేలు టీడీపీకే మెజార్టీ లభిస్తుందనే అంచనాలో వారున్నారు. కాట్రేనికోన విషయానికి వస్తే వైసీపీకి, టీడీపీకి సమానంగా గానీ లేదా వైసీపీకి స్వల్ప మెజార్టీ కానీ చేకూరుతుందనేది వారి అంచనా. ఏది ఏమైనా 15వేల నుంచి 20వేల వరకు టీడీపీకి మెజార్టీ చేకూరుతుందనే ధీమాలో వారున్నారు. పోలింగ్ సరళి ఆధారంగా లెక్కలు కట్టుకుని విజయావకాశాలు, మెజార్టీపై లెక్కలు వేసుకోవడంలో వారు బిజీబిజీగా ఉన్నారు. ఏదేమైనప్పటికీ ఎన్నికల్లో తమకు ఎక్కువ మెజార్టీ లభిస్తుందనే ధీమా కూటమి నాయకుల నుంచి వ్యక్తం అవుతుంది.

టీడీపీ విజయం ఖాయం

అందరిలోనూ ఒకటే ఆనందం

అమలాపురం టౌన్, మే 14: వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకే ప్రజలు పట్టం కట్టారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగియడంతో మంగళవారం ఆయన ఇంటికి పరిమితం కాలేదు. పట్టణ, పల్లెసీమల్లో పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను, కార్యకర్తలను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. పోలింగ్ ప్రక్రియపై స్వగృహంలోనే గ్రామాల వారీగా నాయకులతో సమీక్షించారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పట్టణంలో టీడీపీకి భారీ మెజార్టీ వస్తుందన్నారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంటుందని ఆనందరావు వివరించారు. ఇంటింటా ప్రచారంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆనందరావు తెలిపారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలతో పాటు కూటమి తరఫున ప్రకటించిన మేనిఫెస్టో, వృద్ధులకు పెన్షన్ల పెంపు వంటి సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులతో 20వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

పార్టీ నేతలతో గిడ్డి సమావేశం

పి.గన్నవరం, మే 14: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా పార్టీ టిక్కెట్ కోసం, అనంతరం ప్రచారంలో బిజీగా గడిపిన వివిధ పార్టీల నేతలు సార్వత్రిక ఎన్నికల సంగ్రామం ముగియడంతో పార్టీల నాయకులతో పోలింగ్, మెజార్టీపై లెక్కలు వేసుకుంటూ రిలాక్స్ అవుతున్నారు. జనసేన ఎన్డీఏ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నేతలతో సమావేశమయ్యారు. పోలింగ్ సరళిని తెలుసుకుని బిజీగా గడిపారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి అభ్యర్థిగా తన గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీఏకు మద్దతుగా ఓటు వేసిన నియోజకవర్గ ప్రజలందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

83.64శాతం పోలింగ్



క్రాపచింతలపూడి బూత్‌లో రాత్రి పోలింగ్ జరుగుతున్న దృశ్యం

ముమ్మిడివరం, మే 14: ముమ్మిడివరం నియోజకవర్గంలో 83.64 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 2,45,296 మంది ఓటర్లు ఉండగా 2,05,163మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,22,126మంది పురుషులకు 1,03,951 (85.11శాతం)మంది, 1,23,170మంది మహిళలకు 1,01,212 మంది (82.17 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో యువత ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో నియోజకవర్గం 83.77 శాతం ఓటింగ్ పోలైంది.

87.06 శాతం పోలింగ్

మండపేట, మే 14: మండపేట నియోజకవర్గంలో 87.06 శాతం పోలింగ్ నమోదైందని మండపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్లారావు తెలిపారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో పట్టణంలోని సంఘం పుంతకాలనీలో పోలింగ్ బూత్‌లో రాత్రి 10.30వరకు పోలింగ్ జరిగింది. ఆర్ధరాత్రి ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తు నడుమ అమలాపురం స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. నియోజకవర్గంలో 2,20,409 మంది ఓటర్లకు పురుషులు 94,222, మహిళలు 97,735మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు కంటే మహిళలే ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గం మొత్తం 87.06శాతం పోలింగ్ నమోదైందని ఎల్లారావు తెలిపారు.

83.46 శాతం పోలింగ్ నమోదు

పి.గన్నవరం, మే 14: పి.గన్నవరం నియోజకవర్గంలో 83.46 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. నియోజకవర్గంలోని పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి మండలాలకు సంబంధించి 99,943మంది పురుషులు, 98,653మంది మహిళలు, ఇతరులు ఆరుగురు వెరసి 19,8602మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 212పోలింగ్ కేంద్రాల్లో 84,467మంది పురుషులు, 81,279 మంది మహిళలు, ఇతరులు ముగ్గురు వెరసి 1,65749మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయినవిల్లి మండలం నేదునూరులో 159 పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 95.43శాతం, అత్యల్పంగా అయినవిల్లి మండలం శానపల్లిలంకలో 210పోలింగ్ కేంద్రంలో 69.39శాతం పోలింగ్ నమోదైంది. అలాగే ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో 80శాతానికి పైగా పోలింగ్ కావడం విశేషం.

89.59 శాతం పోలింగ్

కె.గంగవరం 87.37, కాజులూరు 87.17 శాతం పోలింగ్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 14: రామచంద్రపురం నియోజకవర్గం సార్వత్రిక ఎన్నికల్లో 89.59శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా కె.గంగవరం మండలంలో 87.37శాతం, కాజులూరు మండలంలో 87.17శాతం, రామచంద్రపురం మండలం 86.96, పట్టణంలో 78.23శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 2,03,207మంది ఓటర్లకు 1,73,917మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,00,682మంది పురుషులకు 87,429 మంది, 1,02,524 మంది మహిళా ఓటర్లకు 86487మంది, ఒక ట్రాన్స్ జెండర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రామచంద్రపురం పట్టణంలో అధికంగా కొత్తూరులో 89.09శాతం, మండలంలో తోటపేట శివారు కన్నడ తోటలో 95.59శాతం, వేగాయమ్మపేట శివారు కుందాలమ్మచెరువులో 94.62శాతం పోలింగ్ నమోదైంది. కాజులూరు మండలంలో తర్లంపూడి శివారు మామిడాడలో 93.67శాతం పోలింగు నమోదైంది. కె.గంగవరం మండలం కోటిపల్లిలో (227)బూత్‌లో 94.03శాతంపోలింగ్ నమోదైంది.

గంగవరంలో నేత్ర దానం

కె.గంగవరం, మే14: కె.గంగవరంలో మంగళవారం రవణం పట్టాభిరామయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల అనుమతితో కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంకు ప్రతినిధులు నేత్రాలు సేకరించారు. కుటుంబసభ్యులను అభినందించారు.

అమలాపురం లోక్‌సభలో 83.84శాతం పోలింగ్

అత్యధికంగా మండపేటలో 87.06 శాతం
అత్యల్పంగా రాజోలులో 79.02 శాతం
అత్యధికంగా ఓటు వినియోగించుకున్న పురుష ఓటర్లు

అమలాపురం టౌన్, మే 14: అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో రాష్ట్రంలోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రిని చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో బందోబస్తు నడుమ భద్రపరిచారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ వివరాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా మంగళవారం రాత్రి విడుదల చేశారు. అమలాపురం లోక్‌సభ పరిధిలో రాష్ట్రంలోనే అత్యధికంగా 83.84శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 15,31,410 మంది ఓటర్లు ఉండగా వారిలో 12,84,008 మంది ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 6,44,189 మంది, మహిళలు 6,39,808 మంది, ఇతరులు 11 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం ఓటర్ల వివరాలు ఇలా వున్నాయి. అత్యధికంగా మండపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,20,494 మంది ఓటర్లు ఉండగా 1,91,959 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 87.06శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 1,97,920 మంది ఓటర్లు ఉండగా 1,56,400 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 79.02శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 77,351 మంది, మహిళలు 79,048 మంది, ఇతరులు ఒకరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 2,13,508 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,75,845 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 82.36 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 89,007 మంది, మహిళలు 86,837 మంది ఇతరులు ఒకరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో 2,52,383 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,14,975 మంది అంటే 85.18 శాతం పోలింగ్ నమోదైంది. వారిలో పురుషులు 1,07,762 కాగా, మహిళలు 1,07,210 మంది, ఇతరులు ముగ్గురు ఓటుహక్కు వినియోగించుకున్నారు.

బాబోయ్ ఎండలు.. చినుకులు పడటంతో ఉక్కపోత



అంబాజీపేటలో మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న రహదారి

అంబాజీపేట, మే 14: ప్రచండ భానుడి తన ప్రతాపాన్ని చూపడంతో జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణం మార్పులతో ఒక రోజు చిన్నపాటి చిరుజల్లులు పడగా మరుసటి రోజు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. మరో పక్క ఎండలకు తోడు అనధికారిక విద్యుత్ కోత కూడా కొనసాగుతుండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు ఉదయం 10గంటలకే భానుడి ఎండవేడిమి తట్టుకోలేక జనం రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యంగా మారి బంద్ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ప్రస్తుతం 38 నుంచి 40డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి అధిక ఉష్ణోగ్రతల కారణంగా జనం వడదెబ్బలు, వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో నీటి కాలుష్యం వల్ల వాంతులు, విరేచనాలు, కామెర్లు వంటి వ్యాధులు ఎక్కువగా వస్తాయి. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల ఈరోగాలు రాకుండా ఉంటాయి. ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల డిహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడతారు. అలాంటి సమయాల్లో గ్లూకోజ్, కొబ్బరి బొండాలు, తాటిముంజెలు తీసుకోవడం ద్వారా ఎండ నుంచి రక్షణ పొందవచ్చు. ఎండకాలం వేడి వల్ల ఆకలి మందగిస్తుంది. ఇది ముఖ్యంగా రోడ్లపైన ఎండ సమయంలో తిరిగే వారిలో కనిపిస్తుంది. అలాంటి వాళ్లు తగు జాగ్రత్తలు తీసుకుని ఆహారం తీసుకోవాలి. బయట దొరికే ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్ తీసుకోకుండా మజ్జిగ, పండ్ల రసాలు పుచ్చకాయలు తీసుకోవాలి. తినే ఆహారంలో మసాలాలు, నూనె వస్తువులు తగ్గించడం మంచిది. రోజుకు ఎనిమిది లీటర్ల నీరు తప్పకుండా తాగాలి. ఎందుకంటే శరీరంలో చెమట రూపంలో కోల్పోయిన లవణాలు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్స్‌ను ఈనీటి ద్వారా మళ్లీ పొందవచ్చు. మట్టి కుండలో చల్లని నీరు ఫ్రీజ్ వాటర్ కంటే మేలు చేస్తుంది. వెన్న తీసిన మజ్జిగనే తీసుకోవాలి. ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించి కళ్లకు కూలింగ్ గ్లాసులు వాడాలి. కాటన్ దుస్తులు వాడడం వల్ల ఎండవేడిమి నుంచి రక్షణ పొందవచ్చు. వడదెబ్బకు గురైతే వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలి.

వెంకన్న ఆదాయం రూ.2.51లక్షలు

ఆత్రేయపురం, మే14: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఆదాయం రూ.2,51,510 లభించింది. స్వామివారి హుండీల్లోని కానుకలను గురువారం లెక్కిస్తామని ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

మలికిపురంలో చలివేంద్రం

మలికిపురం, మే 14: వేసవి నేపథ్యంలో మలికిపురానికి చెందిన తెలుగు యువత నాయకుడు గుబ్బల విక్రమ్ మలికిపురంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం 14రోజుల నుంచి కొనసాగుతోంది.

విజయం తథ్యం.. పోటెత్తిన అభిమానం



హరీష్‌మాధుర్‌ను అభినందిస్తున్న యువకులు, కార్యకర్తలు



రోళ్లపాలెంలో ఎంపీ అభ్యర్థి హరీష్‌మాధుర్‌కు సత్కారం

అమలాపురంటౌన్, మే14: అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ నివాసానికి జిల్లా నలుమూలల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. పలువురు ముందస్తుగానే అభినందనలు తెలిపి సత్కరించారు. ఈసందర్భంగా హరీష్‌మాధుర్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి తరఫున జిల్లాలో పోటీచేసిన అభ్యర్థులందరూ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. రోళ్లపాలెం శ్రీముత్యాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని హరీష్ దర్శించుకున్నారు. చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో సమకూర్చిన పులిహోర ప్రసాదాన్ని హరీష్ పంపిణీ చేశారు. తొలుత ఆయన్ను గ్రామస్తులు సత్కరించి ఫొటోలు తీసుకునేందుకు ఎగబడ్డారు. సర్పంచ్ మట్టా వైదేహి-రామారావు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, యల్లమిల్లి నాగసుధాకొండలరావు, రంకిరెడ్డి సూర్యనారాయణ, నేదునూరి నతానియేలు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న హరీష్‌మాధుర్

ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం




మామిడికుదురు, మే 14: అప్పనపల్లిలో ప్రీమియర్ లీగ్ 6ఏ సైడ్ క్రికెట్ పోటీలను ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈపోటీల్లో మొదటి బహుమతిగా రూ.20వేలను ఆదిత్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌వారు, రెండో బహుమతిగా రూ.15వేలను ఫహద్, ఇంకా వివిధ రకాల బహుమతులను దాతలు అందిస్తున్నారు. ఈపోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన క్రికెట్ జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. కార్యక్రమంలో గెడ్డం వెంకటేశ్వరరావు, నయినాల కాశీవిశ్వనాథం, మట్టా వెంకటేష్, నీతిపూడి మహేష్, అన్నంనీడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న చైతన్యరాజు తదితరులు

అమలాపురం రూరల్, మే 14: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చేపట్టిన నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజున కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, ఈడీ కె.శశికిరణ్‌వర్మ కుటుంబ సమేతంగా సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామివారి చక్రస్నానం జరిగింది. వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంపై ఉంచి కిమ్స్ సిబ్బంది గ్రామోత్సవం నిర్వహించారు. పండిత సత్కారంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న కిమ్స్ బృందం

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: బాక్
శ్రీలలిత	: ప్రసన్నవదనం
శేఖర్ స్క్రీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్క్రీన్-2	: మంజుమ్మల్ బాయ్స్
రమా	: ఆ ఒక్కటి అడక్కు
గణపతి	: రత్నం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కింగడమ్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ప్రతినిధి-2

నేరేడుమిల్లి చారిటబుల్ ట్రస్టు సభ్యుల సేవలు అమూల్యం

మామిడికుదురు, మే 14: నేరేడుమిల్లి చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలు అమూల్యమైనవని పలువురు కొనియాడారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన నగరం గ్రామానికి చెందిన విద్యార్థులు కొంబత్తుల కుషాల్, నీతిపూడి చంద్రకిశోర్, నేరేడుమిల్లి లాస్యలకు రూ.10వేలు చొప్పున ప్రతిభా పురస్కారంతో పాటు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, ట్రస్టు సభ్యులు నీతిపూడి సుజాత, మట్టా సునీల్‌కుమార్, కీర్తిబాబు, పళ్ల సత్యనారాయణ, నీతిపూడి లక్ష్మీకాంతం, జాలెం నారాయణ, తాడి సుజాత, అప్పారి శ్రీదేవి పాల్గొన్నారు.

ట్యూషన్ మాస్టారుకు సన్మానం



మామిడికుదురు, మే 14: సాధారణంగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆ పాత మధురాలను గుర్తుచేసుకుని విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానిస్తారు. దీనికి భిన్నంగా 2010-11 పదో తరగతిలో ట్యూషన్‌లో విద్యా బుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు మగటపల్లి హైస్కూలు వద్ద కలుసుకుని మంగళవారం సందడి చేశారు. ఆనాడు తమకు ట్యూషన్ చెప్పిన గురువు కొండేపూడి హరినాథ్‌ను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. తామంతా ఉన్నత స్థితిలో ఉండడానికి తమ ట్యూషన్ మాస్టారు హరినాథ్ కూడా కారణమని మగటపల్లి, గోగన్నమఠం, పొన్నమండ గ్రామాలకు చెందిన విద్యార్థులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో కూటమిదే అధికారం

కొత్తపేట, మే14: రాష్ట్రంలో టీడీపీ- జనసేన-బీజేపీ కూటమిదే అధికార పీఠం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. మంగళవారం ఆయన కొత్తపేటలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అరాచకాలతో విసుగు చెందిన ప్రజలు ప్రభుత్వా నికి వ్యతిరేకంగా ఓటేశారన్నారు. కూటమి అభ్యర్థులం దరూ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి విజయం సాధించడంతో పాటు అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్నారు.

ఎల్‌అండ్‌టీలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మే 14: ప్రసిద్ధి చెందిన ఎల్‌అండ్‌టీ కంపెనీలో ఉద్యోగాల కోసం కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌అండ్‌టీ కంపెనీలో 1,600ఖాళీలను భర్తీ చేసేందుకు ఐటీఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్, వెల్డర్, ప్లంబర్, వైర్‌మెన్, కార్పెంటరీ, మాసన్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు చెన్నై, బెంగళూరుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. 18వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు.

గ్రామదేవత పోలేరమ్మ జాతర ప్రారంభం

యానాం, మే 14: యానాం ప్రజల గ్రామదేవత పోలేరమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రతినిధులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి తీసుకువచ్చిన కలశను చిన్నసెంటర్లోని అంగన్‌గుడిలో ప్రతిష్ఠించారు. ఈఉత్సవాలు జూన్ 5 వరకు జరగనున్నాయి. జూన్ 2న చిన్నజాతర, 3న పెద్దజాతర, 4న తీర్థం, 5న అమ్మవారి ఊరేగింపు, నిప్పులగుండం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

యానాంలో పుదుచ్చేరి కమిషనర్ పర్యటన



పుదుచ్చేరి మున్సిపల్ కమిషనర్‌కు స్వాగతం పలుకున్న యానాం కమిషనర్

యానాం, మే 14: పుదుచ్చేరి మున్సిపల్ కమిషనర్ కందస్వామి రెండు రోజుల పర్యటనకు యానాం వచ్చారు. యానాంలో ఆయనకు యానాం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, అధికారులు స్వాగతం పలికారు. యానాంలో పేకాట క్లబ్బులకు మున్సిపాల్టీ ఇచ్చిన అనుమతులు, వాటి స్థితిగతులు తదితర అంశాలను ఆయన పరిశీలించనున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో నవోదయ ప్రతిభ

యానాం, మే 14: సీబీఎస్ఈ 10వ, 12వ తరగతి ఫలితాల్లో యానాం జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. 10వ తరగతిలో యు.సుహితా ఏంజాల్ (98.40శాతం) ప్రథమ, ఎస్ఎస్‌వీ సాయిప్రణీత్ (94.50శాతం) ద్వితీయ, వి.త్రినయ్ సాయిచరణ్ (94.30శాతం) తృతీయ స్థానం సాధించారన్నారు. సీబీఎస్ఈ 12వ తరగతిలో కె.విశాలాక్షి భవ్య 91.80శాతం, ఆదిత్య రంజన్‌నాగ్ 91, పి.ప్రశాంత్ కుమార్ 90.60శాతంతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 12వ తరగతి పరీక్షలు రాసిన 34మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారన్నారు.

అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, మే 14: నందంపూడి అమ్మవారితోటలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

యువకుడి కిడ్నాప్ కథ సుఖాంతం



మలికిపురం, మే 14: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రామరాజులంకలో ఓటు వేసే విషయంలో వివాదం ఏర్పడింది. ఒకరికొకరు తాము ముందని ఇద్దరు తొలి ఓటు వేసే విషయంలో ఘర్షణ పడ్డారు. దీంతో ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఈవిషయంలో తన తాతను రేకపల్లి నాగరాజు కొట్టాడనే కోపంతో జనసేన పార్టీకి చెందిన వారే రేకపల్లి నాగరాజును కిడ్నాప్ చేశారు. గూడపల్లి, కేశనపల్లికి చెందిన జనసేన యువకులు నాగరాజును సోమవారం సాయంత్రం కిడ్నాప్ చేసినట్టు తండ్రి సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. ఈలోగా కిడ్నాప్‌కు గురైన నాగరాజు దొరికినట్టు ఎస్ఐ తెలిపారు. వివరాలు సేకరిస్తున్నామని, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, మే 14: మురమళ్ల గ్రామానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసరావు, అనంతలక్ష్మీ దంపతులు మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు మంగళవారం రూ.10,101 విరాళాన్ని అందించారు. దాతలకు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్ నరసింహకుమార్ మృతి



అంతర్వేది, మే 14: అంతర్వేదికి చెందిన పోతురాజు నరసింహకుమార్ కేన్సర్ వ్యాధితో బాధపడుతూ భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందినట్టు బంధువులు తెలిపారు. సఖినేటిపల్లి మండలంలో 20ఏళ్లపైగా వీఆర్వో బాధ్యతలు చేపట్టి ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న నరసింహకుమార్ ఇటీవల సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై మలికిపురం మండలం వెళ్లారు. వృత్తి రీత్యా నిబద్ధతతో అందరితో కలివిడిగా ఉన్న నరసింహకుమార్ కేన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతిచెందడంపై పలువురు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

పీచు ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



అంబాజీపేట, మే 14: విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగా గంగలకుర్రు పెదగరువులోని సానబోయిన రామకృష్ణకు చెందిన పీచు ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం జరిగింది. పీచు ఫ్యాక్టరీ వద్ద ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్‌పై కొబ్బరి ఆకు పడటంతో మంటలు చెలరేగాయి. దీంతో పక్కన ఉన్న పీచును దగ్ధం కావడంతో స్థానికులు సకాలంలో స్పందించారు. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈప్రమాదంలో రూ.1.50లక్షల విలువగల పీచు దగ్ధమైందని బాధితుడు తెలిపాడు.

అరటితోటలో అగ్నిప్రమాదం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 14: రామచంద్రపురం పట్టణంలో తిలక్ మెమోరియల్ టౌన్ హాలు వద్ద అరటి తోటలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. జనసేన నాయకుడు రాంబాబు నాయుడు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపకదళ అధికారి రామకృష్ణ, సిబ్బంది వాహనంతో చేరుకుని మంటలను ఆర్పివేశారు.